క్లుప్తంగా

బాయ్‌కాట్ చేసిన వైఎస్సార్ సీపీ సభ్యులు

మేదరమెట్ల: కొరిశపాడు మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశానికి వైఎస్సార్ సీపీకి చెందిన 10 మంది సభ్యులు సమావేశాన్ని బాయ్‌కాట్ చేశారు. మండలంలో ఎంపీపీగా ఉన్న సాదినేని ప్రసన్నకుమారి వైఎస్సార్ సీపీని వీడి టీడీపీలోకి పోవడం, గతంలో ఆమె పనులు సక్రమంగా చేయకుండానే అధికారులతో కలసి బిల్లులు చేసుకోవడం వంటి కార్యక్రమాలకు పాల్పడిందని సభ్యులు ఆరోపించారు. అందుకు వెంటనే ఆమె తన ఎంపీపీ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సభ్యులు సమావేశాన్ని బాయ్‌కాట్ చేశారు. సమావేశానికి తగిన సభ్యులు హాజరు కాకపోవడంతో సమావేశం వాయిదా పడినట్లు ఎంపీడీవో సమతవాణి తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ కేసులపై డీఎస్పీ విచారణ


విచారణ చేస్తున్న డీఎస్పీ ప్రసాద్

కారంచేడు: ఎన్నికల సమయంలో మండలంలో నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసులపై చీరాల డీఎస్పీ బేతపూడి ప్రసాద్ మంగళవారం పూర్తి స్థాయి విచారణ చేపట్టారు. డీఎస్పీ వివరాల మేరకు.. మండలంలోని రంగప్పనాయుడువారిపాలెం గ్రామంలో ఎన్నికల మరుసటి రోజున జగిన దాడి కేసులో బాధితులను, ఫిర్యాదుదారులు, ప్రత్యక్ష సాక్షులు, నిందుతులను కూడా పూర్తిస్థాయిలో విచారణ జరిపించామన్నారు. అలాగే మండలంలోని కుంకలమర్రు గ్రామంలోను విచారణ చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఇంకొల్లు సీఐ శ్రీనివాసరావు, కారంచేడు పోలీస్‌స్టేషన్ హెచ్‌సీ బ్రహ్మానందరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పేరుకుపోయిన చెత్త.. తొలగించేవారేరి ?


మాధవస్వామి గుడి రోడ్డులో అధ్వానంగా మారిన మురుగు కాలువ

కారంచేడు: సంపన్నుల గ్రామంగా పేరొందిన కారంచేడులో డ్రైనేజీ వ్యవస్థ దారుణంగా మారింది. గ్రామ పాలకుల నిర్లక్ష్యానికి, పంచాయితీ సిబ్బంది నిర్వాహంతో మురుగు కాలువల్లో చెత్త ఎక్కడకక్కడ పేరుకుపోతున్నాయి. దీంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని మాస్కో బజారు, చెరువుకట్ట, గంటా నాగయ్య రైస్‌మిల్లు, మాధవస్వామి గుడి రోడ్డు, ఎస్టీ కాలనీ, ఎస్సీ కాలనీల్లో ప్రధానంగా మురుగు కాలువలు చెత్తలతో పేరుకుపోయాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో ఎక్కువగా దోమలు విజృంభిస్తున్నాయి. వేసవిలో ఉక్కపోతలతో ఆరుబయట పడుకుందామనుకునే వారు ఈ దోమల బెడదతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. దోమ కాటులతో ఎక్కడ మలేరియా, టైఫాయిడ్ వ్యాధులు వస్తాయోనని వారు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత పంచాయతీ సిబ్బంది ఇప్పటికైనా స్పందించి గ్రామంలోని మురుగు కాలువ సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చోరీకి గురైన సెల్‌ఫోన్ల అప్పగింత


బాధితులకు సెల్‌ఫోన్ అప్పగిస్తున్న సీఐ రాజశేఖర్‌రెడ్డి

మార్టూరు: చోరీకి గురైన సెల్‌ఫోన్లను పోలీసులు బాధితులకు అప్పగించారు. మార్టూరు సీఐ ఎస్వీ రాజశేఖర్ రెడ్డి వివరాల మేరకు.. స్టేషన్ పరిధిలో సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న కొందరుగతంలో ఫిర్యాదు చేశారన్నారు. దర్యాప్తులో భాగంగా అధునాతన సాంకేతికతను ఉపయోగించి సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. మంగళవారం బాధితులను పిలిపించి ఆధారాలను పరిశీలించి సెల్‌ఫోన్లను అప్పగించామని సీఐ పేర్కొన్నారు.

విజ్ఞానాలయాలు

చీరాల అర్బన్: పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథపాలకురాలు డి.ధనమ్మ తెలిపారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు గ్రంథాలయాలకు వచ్చి పుస్తక పఠనం చేయడం వలన విజ్ఞానం పెరుగుతుందన్నారు. శిక్షణ తరగతుల్లో ప్రతిరోజు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం విద్యార్థులతో నీతి కథలు చదివించి మరలా వారిచే కథను చెప్పించారు. ఫ్యాకల్టీ కె.మోహన్ విద్యార్థులకు ఇంగ్లిషు గ్రామర్ తరగతులు నిర్వహించారు. జూన్ 7వ తేదీ వరకు కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. వేసవి శిక్షణ తరగతులకు విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై గ్రంథాలయానికి కొత్తగా వచ్చిన పుస్తక సంపదను సద్వినియోగం చేసుకోవాలన్నారు.


సిద్ధం చేసిన బోదెలు


బోదెల్లో నాటిన చెరుకు

సిరుల సాగుకు సమాయత్తం

- 12 గ్రామాల్లో 600 ఎకరాల్లో నల్లచెరుకు సాగు
- ట్రాక్టర్‌తో బోదెలు చేస్తున్న రైతులు
- 7 నుంచి 8 నెలలకు గడల అమ్మకానికి సిద్ధం
- ఆశాజనకంగా సాగు


కూకట్లపల్లిలో ట్రాక్టర్‌తో బోదెలు చేస్తున్న రైతన్న

బల్లికురవ: వరుణుడు కాస్త ముందుగానే నేను వస్తున్నాను అని చెప్పుండటంతో రైతు మోముల్లో సంతోషాలు కనిపిస్తున్నాయి. ఈఏడాది నైరుతి రుతుపవనాలు ముందుగానే వస్తాయని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. గతేడాది వర్షాభావం వల్ల రైతులు సరైన పంటలు పండించలేకపోయారు. ఎంతో కొంత రబీ సీజన్‌లో అయినా పంటలు బాగా వస్తున్నాయనుకున్న సందర్భంలో అకస్మాత్తుగా మిచాంగ్ తుఫాన్ రైతులను నట్టేట ముంచిపోయింది. ఫలితంగా మిర్చి, శనగ, పొగాకు, వరి తదితర పంటలు తీవ్రంగా నష్టపోయాయి. అద్దంకి నియోజకవర్గంలో 10 సంవత్సరాలుగా జాతర్లు, తిరునాళ్లలో అమ్మే వాణిజ్య పంట నల్లచెరుకు సాగుతో రైతులు లాభాలు గడిస్తున్నారు. మండలంలోని కూకట్లపల్లి, గొర్రెపాడు, వీ. కొప్పరపాడు, వైదన, కొత్తూరు, రామాంజనేయపురం, ఎస్ఎల్ గుడిపాడు, అంబడిపూడి, అద్దంకి మండలం శింగరకొండపాలెం, చక్రాయపాలెం, వెంపరాల, ఉప్పలపాడు, గ్రామాల్లో చెరుకు సాగుకు 20 రోజుల నుంచి సమాయత్తంతో అడుగు ముక్కలు కోసి నాటుతున్నారు.

దుక్కులు దున్ని...

సారవంతమైన నీటి వసతి రహదారి వసతి ఉన్న భూమి ఎంపికతో ఎకరాకు 10 ట్రక్కుల పశువుల ఎరువు తోలి భూమిలో కలియదున్నాలి. ఆ తదుపరి ట్రాక్టర్‌తో బోదెలు చేసి నీటిని బోదెల్లోకి వదిలి ఎకరాకు 10 వేల నుంచి 12 వేల వరకు అడుగు ముక్కలను నాటాలి. గత ఏడాది తోటల్లో మేలు రకమైన గడలను విత్తనపు గడలుగా ఎంపిక చేస్తారు. నీటి తడులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

7 నుంచి 8 నెలలకు సిద్ధం...

నీటితడులతో 7 నుంచి 8 నెలలకు చెరకు పక్వానికి వస్తాయి. ఒక్కో గడ 7 నుంచి 8 అడుగుల వరకు ఎత్తు పెరుగుతుంది. వ్యాపారులే తోటల వద్దకు వచ్చి కొనుగోలు చేస్తారు. దళారుల బెడద లేకుండ ఎకరా గడల లెక్క కొనుగోలుతో పెట్టుబడులు పోను రూ. 50 వేల నుంచి రూ. 60 వేల వరకు నికర ఆదాయం దక్కుతున్నట్లు రైతులు సాక్షికి వివరించారు.

ఎకరా కౌలు రూ. 30 నుంచి 40 వేల వరకు..

బోరు నీటి వసతి ఉన్న భూముల్లోనే చెరకు సాగు చేపడతారు ఎకరాకు రూ. 30 వేల నుంచి రూ. 40 వేల వరకు ముందుగానే కౌలు చెల్లించాలి. పెట్టుబడి కింద రూ. 50 వేల నుంచి రూ. 60 వేల వరకు ఖర్చు అవుతోంది. ఆటుపోట్లు లేనందువల్ల చెరుకు సాగుపై మక్కువతో ఏడాదికి ఏడాది విస్తీర్ణం పెరుగుతోంది. 20 రోజులుగా ట్రాక్టర్‌తో బోదెలు, నాట్లపై గ్రామాల్లో ఊపందుకున్నాయి.

వేసవి దుక్కులు ప్రారంభం

- ముందస్తు వర్షాలతో అన్నదాతల్లో ఆనందం


కారంచేడు సమీపంలో దుక్కులు చేస్తున్న రైతు

కారంచేడు: గత నాలుగు రోజుల క్రితం కురిసిన అకాల వర్షాలతో అన్నదాతల్లో ఆనందం వ్యక్తం అవుతోంది. భూములను దుక్కులు చేసుకోనేందుకు అన్నదాతలు ఉత్సాహం చూపుతున్నారు. దీంతో మండల కేంద్రమైన కారంచేడుతో పాటు సమీప గ్రామాల్లోని కుంకలమర్రు, స్వర్ణ, ఆదిపూడి ప్రాంతాలలోని రైతులు కూడా ముందస్తు వేసవి దుక్కులు చేపడుతున్నారు. వ్యవసాయాధికారుల సూచనలతో వేసవి దుక్కులు చేసుకొని వాటిల్లో పచ్చిరొట్ట ఎరువుల నిమిత్తం పిల్లిపెసర, జనుము, జీలుగలను సాగు చేసుకొనేందుకు వీలుగా వాటని సిద్ధం చేసుకుంటున్నారు. వేసవి దుక్కులు చేసుకొని పచ్చిరొట్ట ఎరువులను సాగు చేసుకోవడం వలన పంటల దిగుబడులు అధికంగా వస్తాయని రైతులు నమ్ముతుంటారు. దీంతో రైతులు వారికి అందుబాటులో ఉండే ట్రాక్టర్లు, కాడి ఎడ్లతో దుక్కులు చేసుకుంటున్నారు.

ఇక్కడి భూములు అనుకూలం..



10 సంవత్సరాలుగా నల్లచెరుకు సాగుచేస్తున్నా ఇక్కడి భూములు సాగుకు అనుకూలం, మంచి దిగుబడులు వస్తున్నాయి. వ్యాపారులే తోటల వద్దకు వచ్చి కొనుగోలు చేస్తుండటంతో దళారుల బెడద లేదు. ఈఏడాది వర్షాలు కురుస్తాయని అధికారులు చెప్పుండటంతో సంతోషంగా ఉంది.

– భవనం శ్రీనివాసరెడ్డి, గొర్రెపాడు

ఆరేళ్లుగా సాగు చేస్తున్నా..



ఆటుపోట్లు లేనందున ఆరేళ్లుగా చెరకు సాగు చేస్తున్నా. వ్యాపారులతో పాటు, మేదరమెట్ల–నార్కెట్‌పల్లి నామ్ రహదారి గ్రామానికి అందుబాటులో ఉండటంతో కొప్పరపాడు వద్ద అమ్మకాలు చేస్తున్నా. ఈఏడాదైనా చెరకు బాగా పండి లాభాలు రావాలని కోరుకుంటున్నా.

వెంపరాల సుబ్బారావు, కూకట్లపల్లి

200 ఎకరాల్లో నల్లచెరుకు సాగు చేశారు..



మండలంలోని కూకట్లపల్లి, గొర్రెపాడు, కొప్పరపాడు గ్రామాల్లో సారవంతమైన భూములు ఉండటంతో అక్కడ రైతులు పదేళ్లుగా తిరునాళ్ల జాతర్లలో అమ్మే నల్లచెరుకు సాగు చేస్తున్నారు. సాగులో మెలుకువలు, సస్య రక్షణ చర్యలతో అధిక దిగుబడులు సాధిస్తున్నారు. సూచనలు సలహాలు పాటించటం వల్ల సాగు విస్తీర్ణం పెరుగుతోంది. ఈఏడాది మే రెండో వారంలోనే వర్షాలు కురవటం వాతావరణం అనుకూలించటంవల్ల ఇప్పటికే సుమారు 200 ఎకరాల్లో సాగు చేపట్టారు. ఈమాసాంతం జూన్ మొదటి వారానికి సాగు పూర్తవుతుంది.

– ఎస్పీపీ కుమారి, వ్యవసాయాధికారిణి

50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు

వేటపాలెం: రైతులకు వ్యవసాయ శాఖ ద్వారా 50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు అందిస్తామని ఏఓ ఐ కాశీవిశ్వనాథ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతు భరోసా కేంద్రాల్లో రైతులు సంప్రదించాలని కోరారు. మండలానికి జీలుగ 27 క్వింటాళ్లు, జనుములు 9 క్వింటాళ్లు, పిల్లిపెసరలు 20 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పర్చూరు (చినగంజాం): వ్యవసాయశాఖ ద్వారా 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు అందిస్తున్నట్లు వ్యవసాయాధికారి ఎస్. రామోహ్మన్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీలుగ 10 కిలోల రూ.440, జనుము 10 కేజీలు రూ.440, పిలిపెసర 8 కేజీలు రూ.536, చొప్పున చెల్లించాలన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు ఆయా గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాల్లో నగదు చెల్లించి విత్తనాలు తీసుకోవాలని కోరారు.

రోగులకు మజ్జిగ పంపిణీ


మజ్జిగ ప్యాకెట్లు పంచుతున్న క్లబ్ సభ్యులు

అద్దంకి రూరల్: రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో విశాంత్ర ఉపాధ్యాయుని యన మంద్ర వరలక్ష్మీ సౌజన్యంతో రోగులకు మజ్జిగ పంపిణీ చేశారు. వేసవిలో రోగులకు మజ్జిగ పంపిణీ చేసినందుకు మెడికల్ ఆఫీసర్ శరత్ దాత వరలక్ష్మీని అభినందించారు. కార్యక్రమంలో రోటరీ అసిస్టెంట్ గవర్నర్ అద్దంకి లెవీ ప్రసాద్, షేక్ మహమ్మద్ రఫీ, చప్పిడి వీరయ్య, విద్వాన్ జ్యోతి చంద్రమౌళి, మలాది శ్రీనివాసరావు, తమ్మన శ్రీనివాసరావు, చిన్నిమురళీ కృష్ణ, కొల్లా భువనేశ్వరీ పాల్గొన్నారు.

వివాహితపై బంధువుల దాడి

మార్టూరు: ఓ వివాహిత మహిళపై భర్త, ఆమె బంధువులు దాడి చేసిన ఘటనపై మార్టూరు పోలీస్ స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. ఏఎస్సై మహబూబ్‌బాషా వివరాల మేరకు.. మండలంలోని జొన్నతాళి గ్రామానికి చెందిన దాలి ఆదిలక్ష్మి భర్త యర్రలింగం దంపతులకు 21 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరుగుతున్న క్రమంలో ఆదిలక్ష్మి గత నెలలో నర్సరావుపేటలోని పుట్టింటికి వెళ్లింది. ఈక్రమంలో యర్రలింగం గతవారం నరసరావుపేట వెళ్లి నచ్చజెప్పి జొన్నతాళికి తీసుకువచ్చాడు. గత ఆదివారం రాత్రి భార్యాభర్తలు గొడవ పడుతుండగా పెరిగి పెద్దదై రామలింగం తల్లి నాగేంద్రం, తమ్ముడు రమణలతో కలిసి ముగ్గురూ రాళ్లు, చేతులతో దాడి చేయడంతో ఆదిలక్ష్మి తీవ్రంగా గాయపడి ఆసుపత్రిపాలైంది. మంగళవారం ఆదిలక్ష్మి స్థానిక పోలీసు స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదిలక్ష్మి భర్త యర్రలింగం, అతని తమ్ముడు రమణ, తల్లి నాగేంద్రంలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

యువకుడి అదృశ్యంపై ఫిర్యాదు



మార్టూరు: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ యువకుడు తిరిగి రాని విషయమై మార్టూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు సీఐ ఎస్వీ రాజశేఖరెడ్డి మంగళవారం రాత్రి తెలిపారు. సీఐ వివరాల మేరకు.. మార్టూరు అంబేడ్కర్ కాలనీకి చెందిన అట్లూరి సుభాషిణి కుమారుడు అట్లూరి మోజెస్ (20) గుంటూరులోని ఓ కళాశాలలో ఫిజియోథెరపి మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవల ఇంటికి వచ్చిన మోజెస్ మంగళవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బంధువులు, స్నేహితుల వద్ద కుమారుడి ఆచూకీ కోసం ప్రయత్నించిన తల్లి సుభాషిణి ఎలాంటి ఫలితం లేకపోవడంతో మంగళవారం రాత్రి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అంగరంగ వైభవంగా ఆదిదేవుడి కల్యాణం


ప్రత్యేక అలంకరణలో స్వామివారి మూలవిరాట్

యద్దనపూడి: సుమంగళ వాయిద్యాలు, వేదమంత్రోచ్చరణలు, భక్తుల జయజయధ్వానాల నడుమ ఆదిదేవుని కల్యాణం మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. మండలంలోని పూనూరు గ్రామంలో వేంచేసి ఉన్న త్రిపురసుందరి సమేత త్రిపురాంతకస్వామి, భద్రకాళి సమేత వీరభద్రస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ప్రతి ఏడాది నిర్వహించే బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారి శాంతి కల్యాణం నిర్వహించటం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా అర్చకులు మూలంరాజ్ రాజ్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో ధ్వజారోహణం, సంప్రోక్షణ పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. మూలవిరాట్‌లకు సువర్ణ, రత్న, నాగాభరణ అలంకారాలు, అర్చనలు, చేశారు. సాయత్రం 5 గంటలకు స్వామివారి కల్యాణ రాయబారం నిర్వహించి రాత్రి 7 గంటలకు ఉత్సవమూర్తులను పసిడి, రజిత ఆభరణాలతో, పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి ముమ్మారు గర్భగుడి ప్రదక్షిణ నిర్వహించారు. రాత్రి 8 గంటలకు నంది వాహనంపై స్వామివారు తమ దేవేరితో కొలువై ఉండగా ప్రత్యేకంగా అలంకరించిన కల్యాణం వేదికపై స్వామివారి ఉత్సవరులను ప్రతిష్ఠించారు. అనంతరం ఈకల్యాణ క్రతువును శైవాగమా ప్రతిష్ఠాచార్యులు నాదెండ్ల విశ్వేశ్వరశర్మ, రామేశ్వర్ గురుకుల్ ఆధ్వర్యంలో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. కల్యాణ ఉభయదాతలు దరువూరి వీరయ్య, సావిత్రి దంపతులు స్వామివారికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈఓ మల్లవరపు నాగయ్య, ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ బత్తుల ఆంజనేయప్రసాద్ చర్యలు చేపట్టారు. కల్యాణం అనంతరం స్వామివారి తలంబ్రాలను, తీర్థప్రసాదాలను భక్తులకు అందజేశారు.


స్వామివారి కల్యాణం చేస్తున్న అర్చకులు

ప్రాథమిక స్థాయిలో గుర్తిస్తే వెరికోసిస్ దూరం


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ లక్ష్మీనారాయణ

చీరాల టౌన్: వెరికోస్, హెర్నియా, కిడ్నీలో రాళ్లతో భాదపడేవారు ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్సలు పొందడం వలన తీవ్ర అనారోగ్యాలకు గురికారని ప్రముఖ ల్యాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ గవిని లక్ష్మీనారాయణ సూచించారు. మంగళవారం పట్టణంలోని కామాక్షి కేర్ హాస్పిటల్‌లో వెరికోసిస్, హెర్నియా, కిడ్నీలో రాళ్ల తదితర వ్యాదులతో భాదపడే వారికి ఉచితంగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. హాస్పిటల్ ఎండీ తాడివలస దేవరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో చీరాల పరిసర ప్రాంతాలకు చెందిన 72 మందికి డాక్టర్ లక్ష్మీనారాయణ వైద్య పరీక్షలు చేశారు. అలానే వ్యాధి తీవ్రతతో బాధపడుతున్న వారిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఉచిత వైద్యశిబిరంలో వైద్యులు జి.నవీన్, హాస్పిటల్ సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే అత్యుత్తమ ఫలితాలు


నక్కబొక్కలపాడులో క్యాంపెయిన్ నిర్వహిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

బల్లికురవ: అనుభవీయులైన అధ్యాపకుల స్వీయపర్యవేక్షణలో ఒత్తిడిలేని విద్యతో అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నట్లు బల్లికురవ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎం. అనిల్ కుమార్ తెలిపారు. మంగళవారం నక్కబొక్కలపాడు, చెన్నుపల్లి గ్రామాల్లో పదోతరగతి పరీక్షలు పాసైన విద్యార్థులను క్యాంపెయిన్‌లో భాగంగా అధ్యాపకులతో కలిసి ఇంటింటికి వెళ్లి కలిశారు. రెండు దశాబ్దాలుగా రాష్ట్ర, జిల్లా స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నట్లు బ్రోచర్ల ద్వారా విద్యార్థులు తల్లిదండ్రులకు వివరించారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులు తెలుగు ఇంగ్లీషు మీడియంలో బోధిస్తున్నామన్నారు. డిజిటల్ తరగతులు, ప్రయోగ శాలలతో అతితక్కువ ఫీజు, ఉచిత పాఠ్య పుస్తకాలతో ఉదయం సాయంత్రం స్టడీ అవర్లు నిర్వహిస్తున్నామని, అవకాశాన్ని గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు. ఈక్యాంపెయిన్‌లో అధ్యాపకులు వేణుగోపాలరావు, లింగేశ్వరరరావు, రామ్మోహన్, శ్రీనివాస రెడ్డి, రవీంద్ర బాబు పాల్గొన్నారు.

వైకల్యం లోపం కాదు


బల్లికురవలో జరుగుతున్న సర్వేను పరిశీలిస్తున్న ఎంఈవో-2

బల్లికురవ: ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులను భవిత కేంద్రాలకు పంపితే అత్యుత్తములుగా తీర్చి దిద్దవచ్చని.. లోపం శాపం కాదని సాధారణ పిల్లలతో సమానంగా పెంచాలని ఎంఈవో–2 రమేష్‌బాబు అన్నారు. మంగళవారం బల్లికురవలో ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులను గ్రామాల వారీగా గుర్తించేందుకు ప్రభుత్వం చేపట్టిన సర్వేను ఆయన పరిశీలించారు. ఈ నెల 2వతేది నుంచి జూన్ 9 తేదీ వరకు సర్వే జరుగుతుందని 5 క్లస్టర్లలోని వైకల్య విద్యార్థులు తమ పేర్లు సర్వే టీమ్ ద్వారా నమోదు చేయించుకోవాలన్నారు. ఇప్పటికీ మండలంలో 25 మంది విద్యార్థులను గుర్తించినట్లు ఐఈఆర్పీలు పీ. నాగబాబు, జీ. నాజిని తెలిపారు. భవిత కేంద్రాల్లో ఆటపాటలతో ప్రత్యేక విద్య స్పీచ్‌థెరపీ, ఫిజియోథెరపీలతోపాటు సదరం క్యాంపుల ద్వారా వైద్య ధ్రువీకరణ పత్రాలు ఉచిత ఉపకరణాలు, రవాణా భత్యం, సహాయకునికి భత్యం అందజేస్తున్నట్లు ఎంఈవో వివరించారు. సర్వేను పకడ్బందీగా నిర్వహించారు. రమేష్‌బాబు ఆదేశించారు.

అంతర్జాతీయ క్రీడాకారుడికి ఆర్థిక సాయం


నాగరాజుకి నగదు అందిస్తున్న రోటరీ క్లబ్ అధ్యక్షుడు మోహనరావు

వేటపాలెం: స్థానిక రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వాలీబాల్ క్రీడాకారుడు పిచ్చుక నాగరాజుకి రూ. 50 వేలు ఆర్థిక సహకారం అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు మంగళవారం బట్టా మోహన్‌రావు మాట్లాడుతూ క్లబ్‌కి సంబంధించిన పూర్వ అధ్యక్షులతో పాటు సభ్యులు నాగరాజుకి సాయం అందించారని తెలిపారు. ఈనెల 28 నుంచి జూన్ మూడో తేదీ వరకు అంతర్జాతీయ పారా వాలీబాల్ పోటీలు చైనాలో జరగనున్నాయి. ఈపోటీలకు పందిళ్లపల్లికి చెందిన దివ్యాంగ క్రీడాకారుడు ఎంపికయ్యాడు. అయితే చైనా వెళ్లడానికి తగిన ఆర్థిక స్తోమత లేక పోవడంతో దాతల సహకారం కోరారు. ఎస్ ఆర్‌ఐలు పేరిసెట్ల లలితబాబు, బొడ్డు వీరమల్లు, కట్టా రాజు వినయ్ కుమార్, వడగప్రసాద యజ్ఞ నాగేంద్రప్రసాద్, పింజల శ్రీనివాసరావు, రొటేరియన్ గొల్లపూడి సీతారాం, కొత్త శ్రీనివాసరావు, నాదేంద్రబాబు, ఉపేంద్ర వాసు, దేవ సింసగ్ తదతలరు ఆర్థిక సహకారం అందించారని చెప్పారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఏఈ యారాజు గణపతి, రోటరీ క్లబ్ కార్యదర్శి ఏవీ సురేష్‌బాబు పాల్గొన్నారు.